రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధికి సన్నాహాలు

పూర్తయిన ఆస్తుల గుర్తింపు

- టీడీఆర్‌లు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న జీహెచ్‌ఎంసీ
- ఇళ్ల యజమానులు ఒప్పుకుంటే పనులు మొదలు

బోరబండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం రహదారి విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయే వారితో పలుమార్లు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరిహారాన్ని చెక్కుల రూపంలో కాకుండా, టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) విధానంలో పొందేలా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. పరిహారం చెల్లింపునకు జీహెచ్‌ఎంసీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో టీడీఆర్ వల్ల అధిక ప్రయోజనం ఉంటుందని బాధితులకు నచ్చచెబుతున్నారు. జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆస్తులు కోల్పోయే వారికి పరిహారంగా డబ్బులైతే రెండురెట్లు, టీడీఆర్ అయితే నాలుగురెట్లు అందిస్తామని చెబుతున్నారు. ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉం టుందని అధికారులతోపాటు రహదారి విస్తరణ నిపుణులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. చాలాకాలంగా స్తబ్ధుగా ఉన్న రహదారి విస్తరణ అంశంలో కాస్త కదలిక కనిపిస్తోంది.

15 ఏళ్ల క్రితం ప్రతిపాదన

దశాబ్ధాలుగా విస్తరణకు నోచుకోని రహ్మత్‌నగర్ రహదారి కారణంగా నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల ప్రజలకు అవస్థ తప్పడం లేదు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ నుంచి రహ్మత్‌నగర్ కూడలి మీదుగా మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు రహదారిని 80 అడుగులకు విస్తరించాలని దాదాపు 15 ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. దీనికి సంబంధించి సర్వేలు చేయడం, నోటీసులు ఇవ్వడం, సమావేశాలు నిర్వహించడం తప్పితే పనుల్లో ఏమాత్రం పురోగతి లేకుండా పోయింది. కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతానికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, చీఫ్ సిటీప్లానర్ దేవేందర్‌రెడ్డి వచ్చి పర్యవేక్షించినా విస్తరణ పనులు ముందుకు సాగలేదు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ నుంచి రహ్మత్‌నగర్, కార్మికనగర్, ఎస్పీఆర్‌హిల్స్ బస్తీలు, మోతీనగర్, బోరబండ, హైటెక్‌సిటీ, మాదాపూర్ ప్రాంతాలకు వెళ్లేందుకు అనువైన మార్గం కావడంతో రహ్మత్‌నగర్ కూడలి అనునిత్యం వాహనాల రద్దీతో కిటకిటలాడుతోంది. కూడలిలో గ్రంథాలయం, హోటళ్లు, దుకాణాలు, మద్యం దుకాణం ఉండడం వల్ల బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇక ఉదయం, సాయంత్రం వేళల్లోనైతే ట్రాఫిక్ బాధలు వర్ణణాతీతం. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు కొందరి ప్రాణాలు కూడ పోయాయి.



రహ్మత్‌నగర్ కూడలిలో ట్రాఫిక్‌జామ్



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క(ఫైల్)

విస్తరణకు ఆస్తుల గుర్తింపు

యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ నుంచి మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు చేపట్టనున్న 80 అడుగుల రహదారి విస్తరణలో మొత్తం 61 ఆస్తులను గుర్తించారు. వీటిలో కొన్ని ప్రభుత్వ ఆస్తులు ఉండగా, మిగతా ప్రైవేట్ ఆస్తుల వారికి చాలా ఏళ్ల క్రితమే నోటీసులు జారీ చేశారు. వారికి పరిహారం చెల్లించేందుకు సంస్థకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున రహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసేలా అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. జంక్షన్ అభివృద్ధిలో ప్రభావితమయ్యే పదకొండు ఆస్తులలో మూడు ప్రభుత్వానికి చెందినవి ఉన్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్ మే స్థలం, గ్రంథాలయం, ప్రభుత్వ భూమి ఉన్నాయి. మిగతా 8 ఆస్తులు ప్రైవేట్ వ్యక్తులవి. కూడలిలోని గ్రంథాలయం, సాయి వైన్స్ దుకాణాలను తొలగిస్తే చాలావరకు ట్రాఫిక్ చిక్కులు తొలిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత క్రమంలో రహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు. ఇటీవల మాస్టర్ ప్లాన్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కూడ పరిశీలించారు.

పనులు త్వరగా చేపట్టాలి

రహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాల్సిన అవసరం ఉంది. వాహనాల రద్దీతో ఈ ప్రాంతం కిటకిటలాడుతుంది. ట్రాఫిక్ చిక్కులు ఏర్పడకుండా, ప్రమాదాలు జరగకుండా కూడలి అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి. తన పదవీకాలం ముగిసేలోపు జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తున్నా.

● కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

టీడీఆర్ తీసుకునేలా ఒప్పిస్తున్నాం

రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి పనుల్లో భాగంగా ఆస్తులు కోల్పోయే వారికి పరిహారాన్ని చెక్కుల రూపంలో కాకుండా, టీడీఆర్ తీసుకునేలా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాం. ఆస్తులు కోల్పోయే వారికి టీడీఆర్ ఇచ్చే అవకాశం కల్పించే జీవో వచ్చిందని, ఈ మేరకు బాధితులను ఒప్పించేలా అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల బాధితులకు రెట్టింపు ప్రయోజనం కలగడమే కాకుండా, పనులు త్వరగా ప్రారంభమయ్యేందుకు అవకాశం ఉంటుంది.

● ఎన్.ప్రసీద, పట్టణ ప్రణాళికవిభాగం ఏసీపీ

మార్గమధ్యంలో రేకులతో కంచె నిర్మాణం

మాదాపూర్, కాకతీయహిల్స్ వెళ్లేందుకు అవస్థలు

బోరబండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ సైట్-3 కాలనీ, బలహీనవర్గాల కాలనీ నుంచి నవభారత్‌నగర్ మీదుగా మాదాపూర్, కాకతీయహిల్స్ వెళ్లే మార్గంలో రేకులతో కంచె నిర్మించడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, కాలిబాటన ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, కాకతీయహిల్స్ పరిసర ప్రాంతాల్లోని కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే చిన్నస్థాయి ఉద్యోగులు అనేకమందికి ఈ మార్గమే శరణ్యం. ముఖ్యంగా హౌస్ కీపింగ్ చేసేవారు, వాచ్‌మన్లు, ఇతర చిన్న,చిన్న ఉద్యోగాలు చేసుకునేవారు ఈ మార్గంలోనే తమ పనులకు వెళ్తుండేవారు. ఇటీవల బానోతు లక్ష్మణ్ పేరిట సర్వేనెంబరు.17/2 స్థలంలో ఇనుప రేకులతో కంచె నిర్మించారు. దీనివల్ల బోరబండ నుంచి నవభారత్‌నగర్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. దీంతో ద్విచక్రవాహనదారులు, కాలిబాటన వెళ్లేవారు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అడపాదడపా ఈ మార్గంలో ప్రయాణించే ఆటోలు, కార్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. చుట్టూ తిరిగి వెళ్లడం చాలా కష్టంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బోరబండ నుంచి మాదాపూర్, కాకతీయహిల్స్ వెళ్లే మార్గంలో నిర్మించిన కంచె



ఈఎస్ఐ సిబ్బందితో కలిసి బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్ ● అమీర్‌పేట, ఆంధ్రజ్యోతి



మౌనికని సన్మానిస్తున్న సీఐ శ్రీనివాస్‌వర్మ

నిజాయితీకి సన్మానం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 12 గ్రాముల బంగారు ఆభరణాన్ని పోలీసులకు నిజాయితీగా అప్పజెప్పిన యువతిని మధురానగర్ సీఐ శ్రీనివాస్‌వర్మ సన్మానించారు. అమీర్‌పేటలోని భారత్ పెట్రోల్ బంక్‌లో మౌనిక పనిచేస్తుంది. సోమవారం బంక్‌లో మౌనికకు 12 గ్రాముల బంగారు చైన్ దొరికింది. మంగళవారం వరకు ఎవరైనా వస్తారేమో అని ఎదురు చూసింది. ఎవరూ రాకపోవడంతో మౌనిక మధురానగర్ పోలీసులకు బంగారు ఆభరణాన్ని అందజేసింది. దీంతో సీఐ మౌనిక నిజాయితీని అభినందిస్తూ శాలువాతో సన్మానించారు.

నిమ్స్‌మేలో ఉద్యోగమేళా నేడు

బోరబండ/యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్‌మేలో నేడు ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే మేళాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్న యువతకు వృత్తి అవకాశాలు కల్పించడమే ఈ మేళా ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా సంస్థల(ఎంఎస్ఎంఈ) మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అసిస్టెన్స్ టు ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్స్(ఏటీఐ) పథకం కింద నిర్వహిస్తున్న ఉద్యమిత్వ, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా మేళా నిర్వహిస్తున్నారు. ఈ సారి ఉద్యోగమేళా కేవలం శిక్షణ పొందిన అభ్యర్థులకు మాత్రమే కాకుండా, అన్నిరంగాలకు చెందిన నిరుద్యోగ యువతకు కూడా ఉంటుంది. ఉద్యోగ అవకాశాలను అన్వేషించే యువత మేళాకు హాజరు కావచ్చు. ఐటీ, ఐటీ ఎనేబుల్డ్ సర్వీసులు, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఫుడ్ ప్రాసెసింగ్, అప్పారెల్-టెక్స్‌టైల్ రంగం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బి.ఎఫ్.ఎస్.ఐ), మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలకు చెందిన 22 ప్రముఖ సంస్థలు ఈ మేళాలో పాల్గొననున్నాయి. ఇవన్నీ నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్(ఎన్.ఎస్.క్యూ.ఎఫ్) ప్రమాణాలకు అనుగుణంగా వివిధ ఉద్యోగాలను కల్పించనున్నాయి. మేళాకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు తమ బయోడేటా, గుర్తింపుపత్రాలు, సంబంధిత సర్టిఫికెట్లు తీసుకొనిరావాలి. మరిన్ని వివరాల కోసం నైపుణ్య శిక్షణ ఇన్‌చార్జి వి.స్వప్నను ఫోన్:040-23633218/61లో సంప్రదించవచ్చు.

యాదగిరిగుట్టకు బస్సులు నడపాలని వినతి

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి అడ్డగుట్ట మీదుగా యాదగిరిగుట్టకు బస్సులు నడపాలని బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు సత్యనారాయణ, గంగారాం మంగళవారం పికెట్ డిపో మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ హనుమాన్‌పేట్ అడ్డగుట్ట, లాలాగూడ, శాంతినగర్ తుకారాంగేట్ ప్రాంతవాసులు యాదగిరిగుట్టకు వెళ్లాలంటే జూబ్లీ బస్టాండ్‌కు రావాల్సి వస్తోంది. సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి మారేడుపల్లి, అడ్డగుట్ట, తుకారాంగేట్, మెట్టుగూడ మీదుగా యాదగిరిగుట్టకు బస్సులు నడపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

యాచక రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మానవత్వ విలువలను, సనాతన ధర్మాన్ని తెలియజేస్తూ యాచక రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ కార్యాలయంలో స్ఫూర్తి, విజేత విద్యాసంస్థలకు సంబంధించిన విద్యా వేత్తలు కిషన్‌రెడ్డిని కలిశారు. యాచక రహిత సమాజం, మానవత్వ విలువలు, ధర్మయుగం అనే అంశాలపై వారు చేస్తున్న కృషిని వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పాటల్ని రూపొందించిన స్ఫూర్తి, విజేత విద్యాసంస్థలను కిషన్‌రెడ్డి అభినందించారు. ఆయా అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ పాడిన పాటలను ఆయన విడుదల చేసి అభినందించారు. అనేకచోట్ల తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు, పిల్లలకు దూరమైన తల్లిదండ్రులు తిండిలేక రోడ్లపైన అడుక్కుంటున్నారని, వారికి సరైన వసతులు కల్పించి అవసరమైన వారిని అనాథ ఆశ్రమాల్లో చేర్పిస్తున్నట్లు నిర్వాహకులు కేంద్ర మంత్రికి వివరించారు. ఇందులో అనేక మంది శారీరక, మానసిక వికలాంగులు కూడా ఉన్నారని చెప్పారు. కొందరిని గురుకుల పాఠశాలల్లోనూ, చిన్న పిల్లలను అనాథ శరణాలయాలల్లోనూ చేర్పిస్తున్నట్లు వివరించారు. పలు అంశాలతో కూడిన పాటను వందేమాతరం శ్రీనివాస్ కిషన్‌రెడ్డికి వినిపించారు. ఈ అంశాలపై ఒక లఘు చిత్రాన్ని కూడా నిర్మించినట్లు చెప్పారు. సమావేశంలో స్ఫూర్తి, విజేత విద్యాసంస్థల అధినేత రామకృష్ణంరాజు, వందేమాతరం శ్రీనివాస్, ముదిగొండ విశ్వేశ్వరశాస్త్రి, సుధీర్‌వర్మ, నంద, కిషోర్ పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డితో స్ఫూర్తి, విజేత విద్యాసంస్థల ప్రతినిధులు

దళితరత్న అవార్డు ప్రదానం

అమీర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ దళిత బహుజన సమితి నగర అధ్యక్షుడు చెలిమెల వెంకటగిరి కిశోర్‌బాబుకు దళితరత్న అవార్డును అందజేశారు. దళిత బహుజన సమితి వ్యవస్థాపకుడు గజ్జెల్లి మల్లికార్జున్ సమక్షంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం అమీర్‌పేటలో కిశోర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ దేశం కోసం రాజ్యాంగాన్ని రాసిన మహానుబావుడన్నారు. ప్రతీ ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలపై పాలకులను నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో బహుజన సమితి ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



దళితరత్న అవార్డు అందుకుంటున్న కిశోర్‌బాబు

పౌష్టికాహారం, మందులతో టీబీని జయించవచ్చు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోపాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని పూర్తిగా నయం చేసుకోవచ్చని రాష్ట్ర టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం అన్నారు. మంగళవారం ఎర్రగడ్డలోని టీబీ సెంటర్‌లో టీబీ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ డి. చల్లా దేవి మాట్లాడుతూ 2030 నాటికి టీబీ వ్యాధిని దేశం నుంచి తరిమి కొట్టేందుకు అన్ని విధాలా కృషి జరుగుతుందన్నారు. ప్లాన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ సెంటర్ ఉద్యోగి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న డాక్టర్ రాజేశం, డాక్టర్ చల్లా దేవి తదితరులు

దేశంలో మొట్టమొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

- ప్రముఖ రోబోటిక్ మోకాలి సర్జన్ డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి

పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొట్టమొదటిసారిగా రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రుల కన్సల్టెంట్ రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జన్, ఎస్‌జీ ఆర్థో కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి తెలిపారు. ఇప్పటికే ఉన్న ఇంప్లాంట్‌ను తొలగించకుండానే మొత్తం మోకీలు మార్పిడిని చేశామని, రోగి పూర్తిగా కోలుకున్నారని ఆయన తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శస్త్ర చికిత్స వివరాలను ఆయన వెల్లడించారు. విశాఖపట్నంలోని కేర్ ఆస్పత్రుల్లో 50 ఏళ్ల రోగికి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను చేశామని తెలిపారు. ఇటువంటి కేసులకు 18 నెలల కాలంలో పలుమార్లు శస్త్రచికిత్సలు అవసరమవుతాయన్నారు. వీటిలో ఇంప్లాంట్ తొలగింపు, వైకల్య దిద్దుబాటు చివరికి కీళ్ల మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విధానాలు అనుసరించాల్సిన అవసరం లేకుండానే అధునాతన వెలిస్ రోబోటిక్ సిస్టమ్‌ను ఉపయోగించి రోగి వైకల్యాన్ని విజయవంతంగా సరిదిద్దామన్నారు. ఇప్పటికే ఉన్న ఇంప్లాంట్‌ను తొలగించాల్సిన అవసరం లేకుండా ఒకే ప్రక్రియలో మొత్తం మోకీలు మార్పిడిని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కొత్త విధానం ఫలితంగా రోగి వేగంగా కోలుకున్నాడని తెలిపారు.



డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి

ముదిరాజ్ ఆత్మగౌరవ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

మల్కాజ్‌గిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ముదిరాజ్ చేపట్టనున్న ముదిరాజ్ ఆత్మగౌరవ పాదయాత్ర పోస్టర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడ్డ ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం, రాజ్యాధికారం కోసం మేడారం నుంచి హన్మకొండ వరకు ముదిరాజ్ పాదయాత్రను చేపట్టనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, హరికుమార్ ముదిరాజ్, భాను ముదిరాజ్, అనిల్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈటల

బాలికపై మారు తండ్రి లైంగిక దాడికి యత్నం

- తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి యత్నించిన మారు తండ్రిపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ ప్రాంతంలో నివాసముండే ఓ మహిళ భర్తతో విడిగా కుమార్తె(10)తో కలిసి ఉంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం కాకినాడకు చెందిన వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. మహిళ గర్భవతి. ప్రసవానికి ఆస్పత్రికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె కుమార్తెపై మారు తండ్రి కన్నేశాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి లైంగికదాడికి యత్నించాడు. తప్పించుకున్న బాలిక స్థానికుల సహాయంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి విద్యుత్ సౌధ పంప్ ఆపరేటర్ మృతి

ఖైరతాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చెట్టుపైకెక్కి ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ విద్యుత్ సౌధ పంప్ ఆపరేటర్ మృతిచెందాడు. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో కార్యాలయాలు ఉన్న విద్యుత్ సౌధలో ఆసిఫ్‌నగర్ జగదాంబనగర్‌కు చెందిన ఉప్పుల కుమార్(43) పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధుల్లో ఉండగా చెట్టు ఎక్కాడు. ప్రమాద వశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య అంబిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుమార్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్థానికంగా మంచి పేరున్న కుమార్ మృతితో జగదాంబనగర్‌లో విషాదం నెలకొంది.



కుమార్(ఫైల్)

ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నాగోలంకకు చెందిన ఆర్.సాయిరామ్(25) రహ్మత్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. భార్య చంద్రిక భీమవరంలోని ఫంక్షన్‌కు వెళ్లి సోమవారం వచ్చింది. ఇంటి తలుపులు ఎంతకీ తెరవకపోవడం భర్తకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. అనుమానం వచ్చి బంధువులకు ఫోన్ చేసింది. ఇరుగుపొరుగు వారిని పిలిచి ఇంటి తలుపులు తెరిచి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ సాయిరామ్ కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య చంద్రిక ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసిన యువకుడి అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న వాచ్‌మన్ చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందిరానగర్‌లో నివాసముండే నరేష్ రసాయిలీ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు.9లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13న రాత్రి విధులు ముగించుకొని వస్తుండగా వెంకటగిరిలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వచ్చారు. ఫోన్ చేసుకుంటామని సెల్‌ఫోన్ అడిగారు. ఫోన్ చేస్తున్నట్టు నటించి సెల్‌ఫోన్‌తో పారిపోయారు. అప్రమత్తమైన నరేష్ వాహనం వెనకాల ఉన్న వ్యక్తి జుట్టు పట్టుకున్నాడు. కానీ, వారు పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడు బేగంపేటకు చెందిన ఇస్మాయిల్‌గా గుర్తించారు. మరో మైనర్ దొరికాడు. ఇస్మాయిల్ పై గతంలో బోయిన్‌పల్లిలో కేసు నమోదైంది. వీరిద్దరూ కలిసి పంజాగుట్టలో కూడా సెల్‌ఫోన్ చోరీ చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్‌ను కోర్టులో హాజరుపర్చారు.

ఆన్‌లైన్ ఉద్యోగంతో మోసపోయిన యువతి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించవచ్చని నమ్మిన యువతి మోసపోయింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లాకు చెందిన సంపూర్ణ మధురానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. దివ్యశర్మ అనే స్నేహితురాలి ద్వారా వెయ్యి రూపాయలు చెల్లించి ఆన్‌లైన్ ఉద్యోగంలో చేరింది. తర్వాత వివిధ ట్యాక్స్‌ల పేరుతో మరో రూ.36 వేలను సంపూర్ణ నుంచి కంపెనీ వసూలు చేసింది. నెలలు గడుస్తున్నా కంపెనీ నుంచి జీతం తిరిగి రాకపోవడంతో మోసపోయానని గమనించిన సంపూర్ణ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, మేకల సారంగపాణి

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

సికింద్రాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో 23న జరిగే బంగారు మైసమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవానికి రావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని మంగళవారం ఆలయ కమిటీ తరపున గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆహ్వాన పత్రిక అందచేశారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ప్రకాష్, సంగం జగదీశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

● ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో నిర్మాణం ఆగిపోయిన కమ్యూనిటీ హాళ్లను పూర్తి చేయాలని, కొత్తగా హాళ్లను నిర్మించాలని ఆయనను కోరారు. ప్రజల ఆహ్లాదానికి, ఆరోగ్యానికి పచ్చదనంలో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కుల అభివృద్ధితోపాటు వాటిలో వాకింగ్ ట్రాక్స్, పిల్లలకు క్రీడాపరికరాలు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని, సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని శ్రీగణేష్ కంటోన్మెంట్‌లో మీడియా ప్రతినిధులకు చెప్పారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

● సికింద్రాబాద్ మహిళ మృతి ● ఎనిమిదిమందికి గాయాలు

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా వచక్కరపట్టి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్‌కు చెందిన ఓ మహిళ మృతి చెందగా, ఆమె కుటుంబానికి చెందిన మరో ఎనిమిదిమంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... సికింద్రాబాద్‌కు చెందిన ప్రకాష్ (76) కుటుంబంతో కలిసి కారులో కన్యాకుమారి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి సోమవారం రాత్రి తిరుపతికి వెళ్తుండగా, అదుపు తప్పిన వాహనం.. వచక్కరపట్టి వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రకాష్ భార్య ఆల్యా రాణి మృతి చెందగా, వారి కుటుంబానికి చెందిన సంతోష్ (42), సుమలత (40), హర్షిత (9), దీపిక (5), సుగుణ (49), లలిత (52), జయశ్రీ (52) గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మేలో అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- తహసీల్దార్ టీ.బీమయ్యగౌడ్

మారేడుపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ పరిధిలోని ఓల్డ్ మారేడుపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మే మొదటి వారంలో అందజేయనున్నట్లు మారేడుపల్లి తహసీల్దార్ టీ.బీమయ్యగౌడ్ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2022 సంవత్సరం మార్చి 3న మొదటి విడతలో భాగంగా అర్హులైన దాదాపు 253 లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. మొదటి విడతలో డబుల్ బెడ్‌రూమ్ పొందిన కొంతమంది ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రెండో విడతలో భాగంగా ఎమ్మెల్సీ కోడ్ నేపథ్యంలో ఏప్రిల్ 30 వరకు అర్హులకు ఇళ్లను అందజేయలేమని తెలిపారు. మే మొదటి వారంలో అర్హులైన అందరికీ అలాట్‌మెంట్ చేసి ఇస్తామని ఆయన పేర్కొన్నారు.



మారేడుపల్లి తహసీల్దార్ టీ.బీమయ్య గౌడ్


తల్లి, కుమారుడి అదృశ్యం.. కేసు నమోదు

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లి కుమారుడు అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కల్పన వివరాల ప్రకారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీ ఫేజ్-2లో రాఘవేంద్ర, అర్చన(33)లు నివాసం ఉంటున్నారు. వీరికి దేవాన్ష్(7) అనే కుమారుడు ఉన్నాడు. గత కొన్ని రోజులుగా వారు ఆర్థిక సమస్యల కారణంగా భార్య భర్తలు 3 రోజులుగా ఇదే విషయమై వాదించుకుంటున్నారు. అర్చన 5 సంవత్సరాలుగా సనత్‌నగర్‌లోని తన తండ్రి ఆర్.నర్సింగ్‌రావు యూనిఫాం బిజినెస్‌లో అడ్మిన్‌గా పనిచేస్తుంది. అయితే 14న ఉదయం ఆమె డ్యూటీకి వెళ్ళింది. అదేరోజు సాయంత్రం 5.30 కు ఆమె తండ్రి కూతురు, మనవడిని ఇక్రిశాట్ కాలనీ ఫేజ్-2 వద్ద దింపాడు. కానీ భర్త తన భార్య సాయంత్రం 6.30 అయినా ఇంటికి రాలేదని, మొబైల్‌కు కాల్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. భర్త కాలనీ పరిసరాలు, బంధువుల ఇళ్లు, తెలిసిన అన్ని ప్రదేశాలలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అనుమానం వచ్చిన భర్త మంగళవారం తన కుమారుడు, భార్య కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అర్చన, దేవాన్ష్

రైలుకింద పడి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మారుతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి రైలు కింద పడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఘటన మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరికి చెందిన మారుతి(33) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అనారోగ్యం కారణంగా ఈ నెల 8న ఇంటి నుంచి మల్కాజిగిరి రైల్వే స్టేషన్ వరకు వచ్చాడు. సికింద్రాబాద్ వైపు వచ్చే రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడి రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలతో కంకర మధ్య పడిపోయాడు. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి రాని బోర్‌వెల్స్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కొలిక్కిరాని బోర్ల నిర్వహణ

సికింద్రాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో వేసే బోర్ల నిర్వహణ ఒక కొలిక్కి రావడంలేదు. అలాగే పవర్ బోర్ల నిర్వహణ బాధ్యత మీరే తీసుకోవాలంటూ శాసనసభ్యుడు ఎంత ఒత్తిడి చేస్తున్నా బోర్డు యంత్రాంగం దిగిరాకపోవడం చర్చనీయాంశం.

అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్ భిన్నమైంది. కంటోన్మెంట్ బోర్డు కేంద్ర రక్షణ శాఖ కనుసన్నల్లో నడుస్తుంది. ఈ సెగ్మెంట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న కొన్ని అడ్డంకులు, అవాంతరాలు కలుగుతుంటాయి. నిధులు కేటాయించడానికి ప్రభుత్వం, శాసనసభ్యుడు సిద్ధంగా ఉన్నా, ఆ పనులు చేపట్టడానికి, నిర్వహణకు (పనులను బట్టి) రక్షణశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఎన్నో సందర్భాల్లో పనులు పెండింగ్‌లో పడకతప్పడం లేదు. తాజాగా పవర్ బోర్ల విషయంలో శాసనసభ్యుడు - కంటోన్మెంట్ బోర్డు అధికార యంత్రాంగం మధ్య వివాదం కొనసాగుతుండడం గమనార్హం. దాదాపు ఏడాది క్రితం జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎన్.శ్రీగణేష్ విజయం సాధించారు. గెలిచిన కొద్ది రోజులకే కాలనీలు/బస్తీల ప్రజలు ఆయనను కలిసి నీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయాలంటూ విజ్ఞప్తి చేశారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించి బోర్లు వేయించారు. అయితే ఆ బోర్‌వెల్స్‌కు విద్యుత్ మోటార్లు బిగించి, నీటి సరఫరా చేయడంలో అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో వేసే బోర్‌వెల్స్‌కు విద్యుత్ చార్జీలు చెల్లించడం తమవల్ల కాదని కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ సాక్షాత్తూ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశాల్లోనే స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన నీటి సరఫరా విషయంలో కఠినంగా వ్యవహరించడం తగదని, నిధులు లేవంటూ బోర్లకు విద్యుత్ చార్జీలు చెల్లించడానికి వెనుకంజ వేయడం తగదని శ్రీగణేష్ వాదిస్తున్నా ప్రయోజనం కలగడం లేదు. కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం తన వాదన నుంచి ఏమాత్రం తగ్గకపోవడంతో ఆయా ప్రాంతాల్లో వేసిన బోర్లు అందుబాటులోకి రాకుండాపోయాయి.



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

నిధులు లేవని చెబితే ఎలా?



ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై, అధికారులపై ఉంది. ప్రజలకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచడానికి బోర్లు వేయించాం. ఈ బోర్లకు ప్రతి నెలా విద్యుత్ ఛార్జీలు కంటోన్మెంట్ బోర్డు చెల్లించాలి. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో వేసే బోర్లకు చార్జీలు చెల్లించడానికి, నిర్వహించడానికి నిధులు లేవని బోర్డు యంత్రాంగం చెప్పడం విడ్డూరంగా ఉంది. కనీస అవసరమైన నీటిని అందించడానికి నిధులు లేవని చెబితే ఎలా? రక్షణశాఖ ఉన్నతాధికారులతో చర్చించి, బోర్ల నిర్వహణ బాధ్యతలు బోర్డు యంత్రాంగం తీసుకోవాలి.

- శ్రీగణేష్, శాసనసభ్యుడు

బోర్ల నిర్వహణ బాధ్యత చేపట్టలేం

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో వేసే బోర్ల నిర్వహణ బాధ్యత మేము చేపట్టలేం. ఈ బోర్లకు ప్రతి నెలా విద్యుత్ చార్జీలు చెల్లించేందుకు సరిపడా నిధులు మా వద్ద లేవు. ఇప్పటికే బోర్డు పరిధిలోని బోర్ల నిర్వహణకు ప్రతి నెలా రూ.50లక్షల చొప్పున చెల్లిస్తున్నాం. అందుకే ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో వేసే బోర్లకు విద్యుత్ చార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులను వారి నిధుల నుంచే చెల్లించాలని చెబుతున్నాం. లేదంటే.. విద్యుత్‌శాఖతో చర్చించి సదరు బోర్లకు చార్జీలు చెల్లించే అవసరం లేకుండా మినహాయింపు తెచ్చుకోవాలి.

- మధుకర్ నాయక్, సీఈఓ, కంటోన్మెంట్ బోర్డు

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

తిరుమలగిరి ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తుల స్వీకరణకు పొడిగించాలని బొల్లారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం బొల్లారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో తహసీల్దార్ కార్యాలయాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నందున దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచాలని కోరారు. ఈమధ్య పండుగలు, సెలవులు ఎక్కువగా రావడం వల్ల పత్రాల జారీలో తీవ్రజాప్యం జరిగిందన్నారు. ఇప్పటికే వందలాదిమంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోలేక ఆందోళన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 14 వరకే విధించిన గడువు పెంచేందుకు పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేకమంది తిరుమలగిరి మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ధ్రువపత్రాల కోసం తిరుగుతున్నారని పేర్కొన్నారు.



ఆర్పీఎఫ్ పోలీసులకు అగ్నిప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్పీఎఫ్ పోలీసులకు అగ్ని ప్రమాదంపై అవగాహన

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ అధికారులు ఆర్పీఎఫ్ పోలీసులకు సూచనలిచ్చారు. ఏప్రిల్ 20 వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆర్పీఎఫ్ పోలీసులకు అవగాహన కల్పించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, టీటీలు, పారిశుధ్య కార్మికులు, జీఆర్‌పీ పోలీసులు, సెక్యూరిటీ గార్డులకు ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పించి, అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సురేందర్ కుమార్ , ఫైర్‌మన్ అశోక్, హరికృష్ణ, రవి కిరణ్‌లు పాల్గొన్నారు.

రవాణా రంగంపై వివక్ష తగదు

● 22న ఇందిరా పార్కు వద్ద ధర్నాకు పిలుపు

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని పలుమార్లు రాష్ట్రంలోని అన్ని యూనియన్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, సంబంధిత అధికారులకు విన్నవించినా కాలయాపన చేస్తున్నారని తెలంగాణ ఆల్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.దయానంద్ మండిపడ్డారు. మొన్న వచ్చిన గిగ్ వర్కర్స్ కోసం ఒక మూసాయిదా బిల్లును తయారు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంపై తగదని అన్నారు. మంగళవారం నారాయణగూడలో యూనియన్ నాయకులు నరసింహారెడ్డి, మల్లేష్‌గౌడ్, బి.రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ట్రేడ్ యూనియన్ నాయకులను సంప్రదించకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అన్ని యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఆపై మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆదాయం ఇవ్వని గిగ్ వర్కర్స్‌కు సంబంధించిన మూసాయిదా బిల్లును తయారు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయాన్ని సమకూరుస్తున్న రవాణా రంగంపై ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. తొలుత తమ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 22న ఇందిరా పార్కు వద్ద రవాణా రంగ కార్మికులతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు.

ప్రజావాణికి 274 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి మొత్తం 274 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జీ డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు సంబంధిత అధికారులతో ఆయా సమస్యలపై ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతోందని ఈ సందర్భంగా వారు తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 53, విద్యుత్ శాఖకు 39, రెవెన్యూకు 51, ఇందిరమ్మ ఇళ్లకు 70, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు సంబంధించి 166 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న డా. చిన్నారెడ్డి

రేషన్ బియ్యం తరలిస్తున్న నలుగురి అరెస్టు

మారేడుపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని పాలవ్యాన్‌లో తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ వజీద్(38), మొహమ్మద్ హుద్దీన్ (22), మల్లేష్(21), యూసుఫ్ (25)లు వారాసిగూడ, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన వారు. వివిధ ప్రాంతాల్లో సేకరించిన 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మిల్క్ వ్యాన్‌లో చిలకలగూడ నుంచి కుత్బుల్లాపూర్‌కు తరలిస్తుండగా జేబీఎస్ వద్దకు రాగానే సమాచారం అందుకున్న మారేడుపల్లి పోలీసులు వారిని పట్టుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి మారేడుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దళితరత్న అవార్డు ప్రదానం

అమీర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ దళిత బహుజన సమితి నగర అధ్యక్షుడు చెలిమెల వెంకటగిరి కిశోర్‌బాబుకు దళితరత్న అవార్డును అందజేశారు. దళిత బహుజన సమితి వ్యవస్థాపకుడు గజ్జెల్లి మల్లికార్జున్ సమక్షంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం అమీర్‌పేటలో కిశోర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ దేశం కోసం రాజ్యాంగాన్ని రాసిన మహనుబావుడన్నారు. ప్రతీ ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలపై పాలకులను నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో బహుజన సమితి ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



దళితరత్న అవార్డు అందుకుంటున్న కిశోర్‌బాబు

నాట్యం ఒక సముద్రం

● మే నెలలో సకల కళల నృత్య సమ్మేళనం

● ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నాట్య కళలు సాంస్కృతిక వికాసానికి, నాగరికతకు చిరునామాలు అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో భారతీయ నృత్య గురువుల సమావేశం చినుకు కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పి.ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ నృత్యాలన్నీ ఒకే వేదిక మీద ప్రదర్శించి సార్వత్రికను చాటడం అవసరం అన్నారు. ప్రజలు, పిల్లలకు మంచి విలువలు కల్పించడం సకల కళల సమ్మేళనం అన్నారు. నాట్యం గొప్ప శాస్త్రం అది ఒక సముద్రం వంటిదని, దానిని విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక కృషి చేస్తోందన్నారు.

ఈ మేరకు సకల కళల నృత్య సమ్మేళనం మే నెల మూడవ వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శాస్త్ర నృత్య కళలకు ప్రజా పాటల పౌరుషాన్ని అద్దితే అదే తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అవుతుందన్నారు. కళలన్నీ ప్రజల వద్దకే వెళ్లాలని మంచి చెడుల నిర్ణయాలు ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నృత్య గురువులు వరుణ్, కృష్ణ, పవన్, లావణ్యయోగా, రాధిక, శ్రీనివాస్, కె.రమాదేవి, పి.లక్ష్మీదేవి, సౌజన్య, నిఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న భూపతి వెంకటేశ్వర్లు, నృత్యగురువులు



విజేతలకి బహుమతి అందజేస్తున్న జీఎం అరుణ్ కుమార్ జైన్

సమ సమాజం కోసం అంబేడ్కర్ అవిశ్రాంత కృషి

- ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

చిలకలగూడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, రైల్ నిలయంలో మంగళవారం బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సమాజంలో సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి కోసం పోరాటం చేశారని తెలిపారు. ఆయన విద్యావేత్త మాత్రమే కాక ఆర్థిక, రాజకీయ సంఘసంస్కర్త అని కొనియాడారు. మహిళలు, కార్మిక హక్కుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదని గుర్తు చేశారు. దేశంలో సామాజిక న్యాయం అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్,ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, వివిధ విభాగాధిపతులు, కార్మిక సంఘాల నాయకులు, సాధారణ సిబ్బంది పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పికెట్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

యాదగిరిగుట్టకు బస్సులు నడపాలని వినతి

అడ్డగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి అడ్డగుట్ట మీదుగా యాదగిరిగుట్టకు బస్సులు నడపాలని బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు సత్యనారాయణ, గంగరాంలు మంగళవారం పికెట్ డిపో మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ హనుమాన్‌పేట్ అడ్డగుట్ట, లాలాగూడ, శాంతినగర్ తుకారాంగేట్ ప్రాంతవాసులు యాదగిరిగుట్టకు వెళ్ళాలంటే జూబ్లీ బస్టాండ్‌కు రావాల్సి వస్తోంది. సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి మారేడుపల్లి, అడ్డగుట్ట, తుకారాంగేట్, మెట్టుగూడ మీదుగా యాదగిరిగుట్టకు బస్సులు నడపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మౌల్కర్ రాజేశ్వర్‌కు డాక్టరేట్

తార్నాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలానికి చెందిన మౌల్కర్ రాజేశ్వర్ తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో ఆర్థికశాస్త్రం విభాగంలో ప్రొ.ఇ రేవతి, ప్రొ.బి.సురేష్ రెడ్డి పర్యవేక్షణలో ఎకనామిక్ అనాలిసిస్ ఆఫ్ ఫార్మ్ - లెవెల్ అడాప్టేషన్ టు క్లైమేట్ ఛేంజ్ ఇన్ డ్రైల్యాండ్ అగ్రో - ఏకోసిస్టమ్ : ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేయడం జరిగిందని మంగళవారం ఆయన తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన అధ్యాపకులకు, తోటి పరిశోధనా విద్యార్థులకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



మౌల్కర్ రాజేశ్వర్ (ఫైల్)



పోషకాలతో కూడిన పౌష్టికాహారం ప్యాకెట్లను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన

● డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, గర్భిణీలు, చిన్నారులు ఆరోగ్యంగా జీవించాలంటే పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. జాతీయ పోషణ మహోత్సవం సందర్భంగా మంగళవారం లాలాపేట్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక మహిళలకు, గర్భిణీలకు, చిన్నారులకు పోషకాలతో పౌష్టికాహారం ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ రోజువారీ ఆహారంలో పోషకాలతో కూడిన ఆకుకూరలు, పండ్లు, మిల్లెట్‌లు, గుడ్లు, పాలు వంటి పదార్థాలను తీసుకోవాలని సూచించారు.